
క్లుప్తంగా

స్వర్ణలింగేశ్వరునికి విశేష పూజలు



నెల్లూరు(బృందావనం) : నగరంలోని స్వర్ణాల చెరువు గణేశ్ ఘాట్ వద్ద కొలువైన స్వర్ణ లింగేశ్వరస్వామి దేవస్థానంలో హంపి విరూపాక్ష విద్యారణ్య మహాసంస్థానాధీశ్వరుడు విద్యారణ్య భారతీ మహాస్వామి సోమవారం విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు రుద్రాభిషేకం, అర్చనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మిక చింతనతో జీవనయానం సుఖమయమవుతుందన్నారు. భారతీయ సనాతన ధర్మం ఎంతో విశిష్టమైనదన్నారు. కార్యక్రమాల్లో పి.సురేంధర్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, పి.సత్యనాగేశ్వరావు, పేటేటి భాస్కర్‌రావు, బాలసుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

నరసింహకొండపై ప్రత్యేక పూజలు



నెల్లూరు సిటీ : మత్స్య జయంతి సందర్భంగా నరసింహకొండపై కొలువైన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం రోడ్డు మార్గాన మత్స్యఅవతార విగ్రహం వద్ద సోమవారం విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు మత్స్య అవతార ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ గోపి, అర్చకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంపై కేసు నమోదు

ఆత్మకూరు(చేజర్ల): చేజర్ల మండలం నూతక్కివారికండ్రిగ సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంపై ఎస్సై తిరుమలరావు సోమవారం కేసు నమోదు చేశారు. తూర్పుపల్లికి చెందిన రత్నమ్మ శుక్రవారం ఉదయం నూతక్కివారికండ్రిగ సమీపంలోని నిమ్మతోటలోకి పనికి వెళ్లింది. మధ్యాహ్నం తిరిగి రోడ్డుపై నడుచుకుంటూ ఇంటికి వస్తున్న క్రమంలో టాటా మ్యాజిక్ డ్రైవర్ బాబు మద్యం మత్తులో వాహనాన్ని నడుపుతూ రత్నమ్మను ఢీకొన్నాడు. దీంతో రత్నమ్మ తీవ్రంగా గాయపడగా నెల్లూరుకు తరలించారు. సోమవారం ఆమె స్పృహలోకి రావడంతో వివరాలు తెలుసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మినీ అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటుపై పరిశీలన

సంగం: స్థానిక పాత చెక్‌పోస్టు వద్ద ఉన్న ఎస్సీ కాలనీలో మినీఅంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటుపై ఐసీడీఎస్ పీడీ నిర్మలాదేవి, డిప్యూటీ డీఈఓ జానకీరాం సోమవారం పరిశీలించారు. రెండ్రోజుల క్రితం సంగంలో పర్యటించిన మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి ఎస్సీకాలనీలో మినీఅంగన్‌వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఆ కాలనీవాసులు వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు మినీఅంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేసేందుకు అవసరమైన మేర చిన్నారులు ఉన్నారా ..లేదా అని స్థానికులను అడిగి తెలుసుకున్నారు. త్వరలో కాలనీలో మినీ అంగన్‌వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని పీడీ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో ఈద్-ఉల్-ఫితర్



ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న చిన్నారులు





బారాషహీద్ దర్గాలో రంజాన్ విశిష్టతను వివరిస్తున్న సయ్యద్ అబూబకర్, హాజరైన ముస్లింలు



- మసీదులు, ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు
- ఆనందోత్సాహాలతో దువా

నెల్లూరు(బృందావనం): ముస్లింలు పవిత్ర ఈద్-ఉల్-ఫితర్‌ను సోమవారం భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. నగరంలోని బారాషహీద్ దర్గా, రంగనాయకులపేట, సంతపేట, నవాబుపేట, నజీర్‌తోట, డైకస్ రోడ్డు, గాంధీనగర్, తదితర ప్రాంతాల్లోని మసీదులు, ఈద్గాల వద్దకు ముస్లింలు పెద్దఎత్తున తరలివచ్చి సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. మతపెద్దలు రంజాన్ సందేశాన్ని అందించారు. అనంతరం పేదలకు తమ వంతుగా దానధర్మాలు చేశారు. తొలుత సంప్రదాయ దుస్తులతో ప్రత్యేక ప్రార్థనలకు హాజరైన ముస్లింలు ఒకరినొకరు ఆలింగనం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

సద్గుణాలు కలిగిన మతం ఇస్లాం

సచ్ఛీలత, సత్ప్రవర్తన, సాంఘిక న్యాయం, సమానత్వం, దైవభక్తి తదితర సద్గుణాలు కలిగి ఉన్న మతం ఇస్లాం అని బారాషహీద్ దర్గా ఖతీబ్ ఓ ఇమామ్ సయ్యద్ అబూబకర్ అష్రఫి సాబిరి తెలిపారు. ఈద్-ఉల్-ఫితర్ సందర్భంగా దర్గామిట్టలోని బారాషహీద్ దర్గా ఈద్గాలో సోమవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, తమ సందేశం అందించారు. సర్వలోక సృష్టికర్త అల్లాహ్ మానవుల పట్ల ఎంతో దయ కలిగి ఉన్నారన్నారు. అనంత కరుణామయుడైన అల్లాహ్ ప్రేమ అంతులేనిది, అంచనా వేయలేనిదన్నారు. మాతృగర్భం నుంచి జనజీవన ప్రవంతిలోకి వచ్చే వరకు తల్లిదండ్రుల ఆలనాపాలన, ప్రేమానురాగాలతో జీవనయానం సాగించేందుకు మానవుడు ఎన్నో అవస్థలను అధిగమిస్తాడన్నారు. దీంతో మంచి, చెడును అర్థం చేసుకోగలిగే తెలివిని ప్రసాదిస్తారని వివరించారు. కరుణామయుడైన అల్లాహ్ రంజాన్ మాసంలో 30 రోజుల కఠోరదీక్ష (రోజా)తో ఉపవాసాలు పాటించమని ఆదేశించారన్నారు. ఈ ఉపవాసాలతో ఆత్మ, శరీరం పరిశుద్ధతను పొంది తద్వారా దైవానుగ్రహం, దైవకృపకు అర్హులవుతారన్నారు. ప్రతి మానవుడు తాను చేసిన దుష్కర్మలకు అల్లాహ్ ఎదుట సమాధానం చెప్పాల్సి ఉంటుందన్నారు. ఇటీవల కాలంలో పాశ్చాత్య నాగరికత మోజులో సమాజం ఎన్నో సమస్యలను ఎదుర్కొంటోందన్నారు. అలాంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. సర్వమానవాళి మార్గ దర్శకత్వం కోసం దివ్యఖురాన్ ఆవిర్భవించిందని, ప్రతి ఒక్కరు పవిత్ర ఖురాన్ పఠించి సన్మార్గం వైపు పయనించాలని ఉపదేశించారు. కాగా ఈద్గా వద్ద జరిగిన సామూహిక ప్రార్థనల్లో వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, పలువురు ముస్లిం నేతలు పాల్గొన్నారు.

ప్రత్యేక ప్రార్థనల్లో ఎమ్మెల్సీ పర్వతరెడ్డి

వీఆర్సీ మైదానంలో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ సిటీ ఇన్‌చార్జి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీ 42వ డివిజన్ అధ్యక్షుడు అబ్దుల్‌మస్తాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రార్థనల్లో ఎమ్మెల్సీ పాల్గొని ముస్లింలకు ఈద్ ముబారక్ తెలిపారు. అనంతరం ముస్లింలకు శీతల పానీయాలు అందజేశారు

- ➡ సంతపేట ఈద్గాలో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

- ➡ నవాబుపేట నజీర్‌తోట ఈద్గాలో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో అంతర్జాతీయ మానవ హక్కుల పరిరక్షణ కమిషన్ రాష్ట్ర చీఫ్ జనరల్ సెక్రటరీ ఇంతియాజ్ పాల్గొన్నారు. ఈద్గా కమిటీ నిర్వాహకులు అలీ, ఖాసిం, బాషు, వాసిఫ్, అహ్మద్, గౌస్‌మొహిద్దీన్, ఆరిఫ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు ఇంతియాజ్‌ను సన్మానించారు.

ఏసీ స్టేడియంలో..

ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్సు కాంప్లెక్స్‌లో ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం రంజాన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు కిలారి శ్రీనివాసులునాయుడు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు నసీర్‌అహ్మద్, నిజాముద్దీన్, మస్తాన్‌బాషా, సోను, నజీర్‌అహ్మద్‌లను సన్మానించారు.

- ➡ చిన్నబజార్‌లోని షహన్‌షా ఖ్వాజాపీర్ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పీఠాధిపతి కేఏస్ఎస్ బాబాసాహెబ్ బంద్‌నవాజ్ దైవ సందేశం ఇచ్చారు.



ముస్లింలకు శీతల పానీయాలు అందజేస్తున్న ఎమ్మెల్సీ పర్వతరెడ్డి



వీఆర్సీ మైదానంలో రంజాన్ విశిష్టతను వివరిస్తున్న యూసఫ్ నజీర్



ఏసీ స్టేడియంలో ముస్లిం వాకర్స్‌కు సన్మానం



షహన్‌షా ఖ్వాజాపీర్ దర్గాలో..

అలరించిన సంగీత రవళి



సంగీత విద్వాంసురాలికి సన్మానం

నెల్లూరు(బృందావనం) : పురమందిరం ప్రాంగణంలోని వర్ధమాన సమాజం హాల్లో ఆదివారం రాత్రి నిర్వహించిన భక్తి సంగీత రవళి కార్యక్రమం అలరించింది. ప్రేమసాధ ఫౌండేషన్ చైర్మన్ నల్లమల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో స్థానిక గాయనీగాయకులు ఆలపించిన అన్నమాచార్య కీర్తనలు, దేశభక్తి గీతాలు, యుగళ గీతాలతో మందిరం పులకించింది. ఈ సందర్భంగా సంగీత విద్వాంసురాలు వేదాంతం హర్షవర్ధినితో పాటు జ్యోతిష్య నిపుణుడు గోవర్ధన్‌లను సన్మానించారు. వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు ఎ.జయప్రకాష్, ప్రకాశ్‌రావు, బంగారయ్య, సేల్స్‌టాక్స్ ఇన్‌స్పెక్టర్ చంద్రపాల్‌సింగ్, పేరూరి ప్రదీప్, నలుబోలు బలరామయ్యనాయుడు, గాయకులు సుదర్శన్, సుధారాణి, విజయలక్ష్మి, ఉమామహేశ్వర్, సురేష్‌రామ్ తదితరులు పాల్గొన్నారు.

ఉగాది పురస్కారాల ప్రదానం



నెల్లూరు(బృందావనం) : పురమందిరం ప్రాంగణంలోని వర్ధమాన సమాజం హాల్లో జీవన యోగశాల ట్రస్ట్ ఆధ్వర్యంలో వివిధ రంగాలకు చెందిన వారికి ఉగాది ప్రతిభా పురస్కారాలను సోమవారం రాత్రి ప్రదానం చేశారు. రామాయణం మహేష్‌నంద స్వామి, ఎ.జయప్రకాష్, యోగా గురువు స్వప్న, శారదామణి, ముత్యాల రవీంద్ర, బలరామయ్యనాయుడు, పాబోలు సత్యనారాయణ, కోట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని ట్రస్ట్ చైర్మన్, యోగా గురువు ప్రసన్నకుమార్ పర్యవేక్షించారు.

ఖాళీ స్థలాలు.. పారిశుద్ధ్యానికి తూట్లు

- నిత్యం దోమలతో సమరం
- రోగాలకు అవాసాలుగా మారిన ఓపెన్ ప్లాట్లు
- యజమానులకు నోటీసుల జారీ
- అయినా స్పందన కరువు
- కార్పొరేషన్ పరిధిలో లోపిస్తున్న పారిశుద్ధ్యం



చిల్డ్రన్స్‌పార్క్ రోడ్డు రామ్‌జీనగర్‌లోని ఖాళీ స్థలంలో పేరుకుపోయిన చెత్త

స్వచ్ఛ పట్టణాలుగా తీర్చిదిద్దే ప్రభుత్వ ప్రయత్నానికి ఓపెన్ ప్లాట్లు గుదిబండగా మారాయి. ఇక్కడ నీరు నిల్వ చేరడంతో దోమలకు ఆవాసంగా మారుతున్నాయి. ఖాళీ స్థలాల్లో చెత్త చెదారం, పిచ్చి మొక్కలు, పొదలు పెరిగి పారిశుద్ధ్యం కొరవడుతోంది. దీంతో ఆయా స్థల యజమానులకు నోటీసులు జారీ చేసినా స్పందన లేకపోవడంతో కార్పొరేషన్ యంత్రాంగం దిక్కుతోచని స్థితికి గురవుతోంది.

నెల్లూరు(బారకాసు) : నెల్లూరు కార్పొరేషన్ పరిధిలో దాదాపు 6,500కు పైగా ఓపెన్ ప్లాట్లు ఉన్నట్లు సమాచారం. ఆయా ఖాళీ స్థలాలు దోమలకు నిలయంగా మారి డెంగీ, మలేరియా లాంటి సీజనల్ వ్యాధుల వ్యాప్తికి కారణమవుతున్నాయి. పెరుగుతున్న నగరీకరణ నేపథ్యంలో కార్పొరేషన్ పరిధిలో పెద్ద ఎత్తున స్థలాలు కొనుగోలు చేస్తున్నారు. మరోవైపు కొత్త కాలనీలు ఏర్పడి పెద్ద ఎత్తున గృహ నిర్మాణాలు జరుగుతున్నాయి. ఈ లెక్కన నగరపాలక సంస్థ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఓపెన్ ప్లాట్స్ సంఖ్య పెరుగుతూనే ఉంది. ఇలా వేలాది సంఖ్యలో ఖాళీ స్థలాలు ఉండటంతో వాటి నిర్వహణ పట్ల యజమానులు పట్టించుకోకుండా ఉండడంతో పిచ్చిమొక్కలు, పొదలు, చెత్త పెరిగి దోమలు వృద్ధి చెందుతున్నాయి. దీనివల్ల ఎదుర్కొంటున్న ఇబ్బందులను సమీప నివాస ప్రజలు అధికారుల దృష్టికి తీసుకొస్తున్నారు.

నోటీసులు జారీ

నివాసాల మధ్య ఉన్న ఖాళీ స్థలాల వల్ల ఇబ్బందులు ఉన్నాయని ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులకు కార్పొరేషన్ యంత్రాంగం స్పందించింది. ఈ మేరకు సంబంధించిన స్థల యజమానులకు నోటీసులు జారీ చేశారు. ఖాళీస్థలంలో పేరుకుపోయిన చెత్త, చెదారం, పిచ్చిమొక్కలు, తొలగించి పరిశుభ్రంగా చేసుకోవాలి, లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ లెక్కన నగర కార్పొరేషన్ పరిధిలో దాదాపు 6,500కు పైగా ఉన్న ఖాళీ స్థలాలకు సంబంధించిన అనేక మంది యజమానులకు నోటీసులు జారీ చేశారు. అయినప్పటికీ వారి నుంచి స్పందన రాకపోవడంతో సీజనల్ వ్యాధుల కట్టడి సమస్యగా మారింది.

అధికారులపై ఒత్తిడి

ఖాళీ స్థలాల యజమానులు స్పందించకపోవడంతో కార్పొరేషన్ సిబ్బందే శుభ్రం చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఈ సమస్యను అధిగమించేందుకు ఈసారి కొత్త ప్రయోగం చేయాలని సంకల్పించింది. వన మహోత్సవంలో భాగంగా ఖాళీ స్థలంలో ప్రస్తుతం ఉన్న పిచ్చి మొక్కలు, చెత్త చెదారం తొలగించి మొక్కలు నాటాలని నిర్ణయించింది. ఈమేరకు సంబంధించిన ఖాళీ స్థలాల యజమానులను ఇందులో భాగస్వామ్యం చేయాలనే ఆలోచన చేస్తున్నట్లు సమాచారం.

చర్యలు చేపడుతున్నాం



ఖాళీ స్థలాల్లో పేరుకుపోయిన చెత్త చెదారం, పొదలను తొలగించి పరిశుభ్రంగా ఉంచుకోవాలని సంబంధిత యజమానులకు నోటీసులు జారీ చేస్తున్నాం. ఇప్పటికే అనేక మందికి నోటీసులు జారీ చేశాం. కొన్ని స్థలాల వద్ద నోటీసు బోర్డులు కూడా ఏర్పాటు చేశాం. స్పందించకపోతే ఖాళీ స్థలాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టి వారి ద్వారా సంబంధించిన చార్జీలు వసూలు చేస్తాం.

– డాక్టర్ చైతన్య, హెల్త్ ఆఫీసర్, నెల్లూరు కార్పొరేషన్



మినీబైపాస్ శ్రీహరినగర్ సమీపంలో..



అన్నమయ్య సర్కిల్ సమీపంలో..

కార్పొరేషన్‌కు పంగనామం

- ఎన్‌ఎంసీకి ఆస్తి పన్ను చెల్లించని ప్రభుత్వ కార్యాలయాలు
- రూ.36.67 కోట్ల మేర బకాయిలు
- ఏళ్లుగా పట్టించుకోని అధికారులు
- ఆదాయాన్ని కోల్పోతున్న నగరపాలక సంస్థ
- వసూళ్లలో మొహమాటానికి పోతున్న అధికారులు



నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయం

నెల్లూరు(బారకాసు) : ప్రభుత్వంలోని వివిధ శాఖలకు చెందిన చర, స్థిరాస్తులకు సంబంధించి నగరపాలక సంస్థకు ఆస్తి విలువను బట్టి పన్ను చెల్లించాలనే నిబంధనలు ఉన్నాయి. ఎన్ఎంసీ పరిధిలో ఉన్న బీఎస్ఎన్ఎల్, పోస్టాఫీసు, సబ్‌రిజిస్ట్రార్, పోలీస్, విద్యుత్‌శాఖ, వ్యవసాయ మార్కెట్ కమిటీ, ప్రభుత్వ ఆస్పత్రులు, అగ్నిమాపక కేంద్రం ఇలా పలు ప్రభుత్వ భవనాలకు ఆస్తి పన్నును సంబంధిత అధికారులు చెల్లించాల్సి ఉంది. నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వంద వరకు ప్రభుత్వ కార్యాలయాలున్నాయి. ఆయా కార్యాలయాలకు ఆస్తి పన్ను చెల్లించాలని పలుమార్లు కార్పొరేషన్ అధికారులు నోటీసులు జారీ చేసినా ఎలాంటి స్పందన ఉండటం లేదు. పన్నుల వసూళ్లలో అధికారులు నిక్కచ్చిగా వ్యవహరించకపోవడం, ఆయా శాఖల ఉన్నతాధికారులతో ఉన్న మొహమాటంతో బకాయిలు పేరుకుపోతున్నాయి. దీంతో నగరపాలక సంస్థ అభివృద్ధి అంతంతమాత్రంగానే సాగుతోంది. నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో వివిధ శాఖల కార్యాలయాల నుంచి పన్ను బకాయి రూ.36,67,35,000కు పేరుకుపోయింది.

పలు ప్రభుత్వ కార్యాలయాల బకాయిల వివరాలు

రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించి మొత్తం 400 అసెస్‌మెంట్స్ ఉన్నాయి. వీటి నుంచి రూ.32,92,00,000 రావాల్సి ఉండగా ఇప్పటివరకు రూ.2,29,00,000 వసూలైంది. అదేవిధంగా కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించిన మొత్తం అసెస్‌మెంట్స్ 41 ఉండగా వీటి నుంచి రూ.6,07,00,000 రావాల్సి ఉంటే ఇప్పటి వరకు చెల్లించిన మొత్తం రూ.2,65,000. ఇంకా ఎన్ఎంసీకి రూ.6,04,35,000 చెల్లించాల్సి ఉంది. ఆయా ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించిన ఆస్తి పన్ను దాదాపు 20 సంవత్సరాల నుంచి బకాయిలు ఉన్నాయి. వీటిని వసూలు చేసేందుకు ఎన్ఎంసీ అధికారులు ఎందుకు మొహమాటం పడుతున్నారో అర్థం కావడం లేదు. ఇకనైనా సంబంధిత ఎన్ఎంసీ ఉన్నతాధికారులు ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించి ఆస్తిపన్ను బకాయిలను కచ్చితంగా వసూలు చేసేలా తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. లేనిపక్షంలో ఇలా రూ.కోట్లు మేర బకాయిలు పేరుకుపోయే పరిస్థితి ఏర్పడనుంది.

నోటీసులు జారీ చేస్తున్నాం



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించిన ఆస్తి పన్ను బకాయిలు చెల్లించాలని తమ వంతుగా నోటీసులు జారీ చేస్తునే ఉన్నాం. ఆయా ప్రభుత్వ కార్యాలయ అధికారులు కూడా స్పందించి ప్రభుత్వానికి లేఖలు రాస్తున్నారు. ప్రభుత్వం నుంచి పన్ను చెల్లించేందుకు నిధులు పంపించిన వెంటనే చెల్లిస్తున్నారు. ఇప్పటి వరకు దాదాపు రూ.2 కోట్లకు పైగా వసూలు చేశాం. మిగిలిన బకాయిలను కూడా వసూలు చేస్తాం.

– చెన్నుడు, డిప్యూటీ కమిషనర్, నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్

ఉపాధ్యాయుల సమస్యలపై రేపు నిరసన

నెల్లూరు (టౌన్) : పీఆర్సీ, ఐఆర్ బకాయిలు తదితర సమస్యల పరిష్కారానికి ఈనెల 2వ తేదీన ఫ్యాప్టో ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముందు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఫ్యాప్టో జిల్లా చైర్మన్ మదుసూదనరావు, సెక్రటరీ జనరల్ జావీద్‌లో సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిరసన కార్యక్రమానికి జిల్లాలోని ఉపాధ్యాయులందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు.

వైభవంగా గంగమ్మ గ్రామోత్సవం



మనుబోలు: ఉగాది పండగను పురస్కరించుకుని మనుబోలు మండల కేంద్రంలో గంగమ్మ గ్రామోత్సవాన్ని ఆదివారం అర్ధరాత్రి వైభవంగా నిర్వహించారు. గంగమ్మకు అర్చకుడు సుబ్రహ్మణ్యశర్మ అభిషేకాలను నిర్వహించి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన గంగమ్మను ట్రాక్టర్‌పై ఉంచి గ్రామోత్సవం జరిపారు. మహిళా భక్తులు గంగమ్మకు మంగళ హారతులిచ్చారు. ఉత్సవం వెంట ఏర్పాటు చేసిన మంగళ వాయిద్యాలు, తప్పెట్లు ఆకట్టుకున్నాయి.